## సైన్స్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థినుల ఎంపిక



ఝూన్సీరాణి, రక్షిత

కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి 26 : కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్.ఝూన్సీ రాణి, కే.రక్షిత బొల్లారంలో నిర్వహించనున్న సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యారని పీడీ నోముల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌ను గురువారం నిర్వహించనున్నారని, ఈ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కబర్చిన విద్యార్థులకు ఈ నెల 28 నేషనల్ సైన్స్ రోజున బహుమతులు అందజేస్తారని ఆయన తెలిపారు.

## రోటరీ క్లబ్ 50వ వార్షికోత్సవం




మాట్లాడుతున్న జిల్లా మాజీ గవర్నర్ ఎన్.వీ.హన్మంత్‌రెడ్డి

కామారెడ్డి, ఫిబ్రవరి 26 : జిల్లా కేంద్రంలో రోటరీ క్లబ్ కామారెడ్డి 50వ వార్షికోత్సవాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మాజీ గవర్నర్ ఎన్.వీ.హన్మంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. 50 ఏండ్లుగా క్లబ్ అనేక సామాజిక సేవలందించిందని అన్నారు. పాల్వంచ జడ్పీహెచ్‌ఎస్ బాలబాలికలకు రూ.పది లక్షల విలువైన మోడ్రన్ టాయిలెట్స్ మంజూరు చేశామని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. క్లబ్ ఏర్పడిన నాటి నుంచి అనేక విద్య, వైద, సామాజిక, ఆర్థిక అంశాల్లో అనేక సేవలు చేపట్టిందని సమాజసేవే రోటరీ ధ్యేయంగా పని చేస్తూ ముందుకు వెళ్తుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ అశోక్, అసిస్టెంట్ గవర్నర్ గట్టు జ్ఞాన్ ప్రకాశ్, పూర్వ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కంకణాల కిషన్, సుభాష్ చంద్ జైన్, శ్రీశైలం, ధనుంజయ, డాక్టర్ బాలరాజ్, రామలింగం, కాశీనాథం, జైపాల్‌రెడ్డి, సత్యం, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాంబార్‌లో పడి.. చికిత్స పొందుతూ బాలుడి మృతి

భీమ్‌గల్, ఫిబ్రవరి 26 : శుభకార్యానికి వెళ్లిన బాలుడు ఆడుకుంటూ వెళ్లి వేడి సాంబార్‌లో పడి మృతి చెందిన ఘటన భీమ్‌గల్‌లో చోటు చేసుకున్నది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కర్నే నిహారిక తన కుమారుడితో కలిసి తమ సమీప బంధువుల ఊరు ముచ్కూర్‌కు ఈనెల 19న వెళ్లింది. అక్కడ ఆమె కుమారుడు చార్విక్(3) ఆడుకుంటూ వంటలు చేస్తున్న స్థలంలోకి వెళ్లి ఒక్కసారిగా వేడి సాంబార్‌లో పడడంతో శరీరమంతా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. మృతుడి తల్లి నిహారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# నిలిచిన భవన నిర్మాణ పనులు

- నీరుగారుతున్న చిరువ్యాపారుల ఆశలు
- రూపాయి చెల్లించని ప్రభుత్వం



బాన్సువాడలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు

బాన్సువాడ, ఫిబ్రవరి 26 : పట్టణంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. చిరు వ్యాపారులు మొదలుకొని పెద్ద వ్యాపారులతోపాటు పట్టణ ప్రజల సౌకర్యార్థం గత ప్రభుత్వం సమీకృత మార్కెట్ (ఇంటిగ్రేటెడ్ మార్కెట్) నిర్మాణ పనులను చేపట్టింది. సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం సుమారు రూ.6 కోట్ల 50 లక్షల ప్రణాళిక అంచన వేసి, మంజూరు చేసింది. ఇదిలా ఉంటే రెండేండ్ల కింద ప్రారంభమైన భవన నిర్మాణ పనులు సుమారు 40 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఎంతో మంది వ్యాపారులకు జీవనోపాధి లభిస్తుందని అనుకున్నా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మాత్రం చిరువ్యాపారుల ఆశలను నీరుగారేలా చేసింది.

**రూపాయి చెల్లించని వైనం**

బాన్సువాడలో ప్రజల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టగా కాంగ్రెస్ ప్రభుత్వం రూపాయి కూడా చెల్లించలేదని తెలిసింది. రెండున్నరేండ్ల కిందట ప్రారంభమైన సమీకృత మార్కెట్ భవనం సుమారు 40 శాతం పనులు పూర్తయినా ఇప్పటి వరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు రూ.కోటీ మూడు లక్షలు బిల్లులు రావాల్సి ఉందని చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు ముందుకు సాగుతాయని పట్టణ ప్రజలు, చిరువ్యాపారులు కోరుతున్నారు.

### ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి



బాన్సువాడలో చేపట్టిన ఇంటిగ్రేడెట్ మార్కెట్ భవన నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం నిధులను వెంటనే విడుదల చేయాలి. ముఖ్యంగా పట్టణంలో సమీకృత మార్కెట్ కావడంతో అన్ని నిత్యావసర సరుకులు, కూరగాయలు, మాంసాహారం తదితర అన్ని వస్తువులు ప్రజలకు ఒకే చోట లభించే సౌలభ్యం ఉంటుంది. ప్రజలకు మేలు చేకూరుతుంది. **– మోచి గణేశ్, బాన్సువాడ**

# శివనామస్మరణలో మార్మోగిన శైవక్షేత్రాలు



మద్దికుంటలో రథాన్ని లాగుతున్న భక్తులు



భిక్కనూరు సిద్ధరామేశ్వర స్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఫిబ్రవరి 26 : జిల్లా వ్యాప్తంగా ప్రజలు మహాశివరాత్రి పర్వదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచే శివాలయాలకు తరలివచ్చి అభిషేకాలు నిర్వహించారు. హరహర మహదేవ అంటూ శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. కామారెడ్డితోపాటు ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లోన్ని శివాలయాల్లో భక్తులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి సోమలింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌లోని త్రిలింగేశ్వరాలయాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సందర్శించారు. గర్భగుడిలోని ప్రత్యేక అభిషేకాలు చేశారు.

## కుంటలో పడి మహిళ ఆత్మహత్య

లింగంపేట, ఫిబ్రవరి 26 : లింగంపేట మండలం మోతె గ్రామానికి చెందిన పాగల సంగవ్వ(52) గ్రామ శివారులోని కుంటలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై ప్రకాశ్ తెలిపారు. సంగవ్వ కొంత కాలంగా దగ్గు, దమ్ముతో బాధపడుతున్నట్లు తెలిపారు. వారం రోజులుగా దగ్గు, దమ్ముతో తీవ్రంగా బాధపడుతున్న సంగవ్వకు పలు ప్రైవేటు దవాఖానల్లో చికిత్స చేయించారు. దగ్గు, దమ్ము తగ్గక పోవడంతో పాటు మతిస్థిమితం కోల్పోయినట్లు వ్యవహరించేదన్నారు. మంగళవారం సాయంత్రం ఇంట్లోంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల గాలించగా గ్రామ శివారులోని కుంటలో సంగవ్వను గుర్తించి బయటికి తీసిన సమయంలో కొనఊపిరితో ఉండి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త పాగల భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## పురుగులమందు తాగిన మహిళ మృతి

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 26 : తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన హన్మంతోళ్ల సావిత్రి(40) చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వారం రోజుల క్రితం సావిత్రి భర్త లక్ష్మణ్ మద్యం తాగి ఇంటికి రావడంతో ఇద్దరు గొడవ పడ్డారు. దీంతో సావిత్రి అదేరోజు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. పురుగుల మందు తాగిన విషయాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. తిరిగి అక్కడి నుంచి 24వ తేదీన నిజామాబాద్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి కుమారుడు నితీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## రథోత్సవంలో అపశృతి



చికిత్స పొందుతున్న యువకుడు

రామారెడ్డి, ఫిబ్రవరి 26 : మండలంలోని మద్దికుంట అటవీ ప్రాంతంలో ఉన్న బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయ వద్ద బుధవారం రథోత్సవం నిర్వహించారు. రథాన్ని పుర వీధుల్లో తిప్పుతుండగా భక్తులు రథం లాగుతున్నప్పుడు ప్రమాదం చోటు చేసుకున్నదని స్థానికులు తెలిపారు. కామారెడ్డిలోని దళితవాడకు చెందిన నవీన్ రథాన్ని లాగుతుండగా ప్రమాదవశాత్తు రథం చక్రం ఆయన కాలుకు తగలడంతో గాయపడ్డాడు. వెంటనే పోలీసులు అతన్ని వెనక్కిలాగి కాపాడారు. అక్కడ వైద్య శిబిరంలో సిబ్బంది ప్రథమ చికిత్స చేసిన అనంతరం కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి 108 వాహనంలో మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రథం లాగుతున్న వారికి, పోలీసులకు మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకున్నది. ఏఎస్పీ సముదాయించడంతో రథాన్ని భక్తులు లాగారు.

## కందకుర్తి గోదావరిలో మునిగి యువకుడి మృతి

రెంజల్ (శక్కర్‌నగర్), ఫిబ్రవరి 26: రెంజల్ మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గంగానదిలో స్నానానికి వచ్చిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతి చెందాడు. రెంజల్ ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ మండలం బర్దీపూర్ గ్రామానికి చెందిన ఎ. వర్ధన్ (23) తన మిత్రుడు మేకల విఘ్నేశ్‌తో కలిసి బుధవారం ఉదయం కందకుర్తి గోదావరిలో స్నానానికి వెళ్లాడు. ఇరువురు స్నానానికి నీటిలోకి వెళ్లగా వర్ధన్ బయటకు రాకపోవడంతో ఆందోళన చెందిన విఘ్నేశ్ విషయాన్ని కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. వర్ధన్ నీటిలో మునిగి చనిపోగా, మృతదేహాన్ని ఈతగాల్లు బయటకు తెచ్చారు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు శవ పంచనామా జరిపి, పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెంజల్ ఎస్సై తెలిపారు.

## మాయ మాటలు చెప్పి బంగారు నగలు చోరీ

భిక్కనూరు, ఫిబ్రవరి 26 : లోన్ పేరుతో మాయ మాటలు చెప్పి మూడు తులాల బంగారపు పుస్తెలు చోరీ చేసిన ఘటన భిక్కనూరులో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరుకు చెందిన ఊరే లక్ష్మి వెదురు బొంగుల దుకాణం నిర్వహిస్తుంటుంది. ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మీ షాపుపై లోన్ ఇస్తామని చెప్పాడు. దీనికి ఆమె నిరాకరించింది. గుర్తు తెలియని వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయి మళ్లీ కొద్ది సేపటికి తిరిగి ఆమె వద్దకు వచ్చాడు. మీకు రూ.లక్ష లోన్ వస్తుందని చెప్పాడు. బస్టాండ్ వద్ద మా మేడంను కలిస్తే లోన్‌ను మంజూరు చేస్తారని, ఆమెను కలిసేటప్పుడు మెడలోని బంగారం ఆమెకు కనిపించకూడదన్నాడు. మెడలో ఉన్న బంగారు గొలుసును తీసేసి పెట్టెలో దాచిపెట్టి ఉంచితే బస్టాండ్ వద్ద ఉన్న మేడం వద్దకు వస్తే మీకు రూ.లక్ష లోన్ ఇస్తుందని మాయ మాటలు చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగ ఊరే లక్ష్మి తన మూడు తులాల పుస్తెలతాడును తీసేసి పర్సులో వేసుకొని, ఈ పర్సును షాపులో ఉన్న ఓ పెట్టెలో పెట్టి తాళం వేసి బస్టాండ్ వరకు వెళ్లింది. అక్కడ ఎవరూ కనిపించక పోయేసరికి తిరిగి షాపు వద్దకు వచ్చి చూడగా బంగారం దాచి ఉంచిన పెట్టె తాళాన్ని, మూడు తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లినట్లు ఎస్సై తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, **CHEPUR SRIDHAR GOUD** (Old-Name) S/o CHEPURI SUDHARSHAN GOUD ,R/o .H.No.3-67 , Gouds Colony Ravutla,Vil ,Sirikonda,Mdl, Nizamabad ,Dist., T.S., My Passport No. **M2933302** have Changed my Surname / name as **CHEPURI SRIDHAR GOUD** (New Surname/name) **NTZ-338519**

**CHANGE OF NAME**

★I, **CHEPUR CHANDRAKALA** (Old Name) W/o ,CHEPURI SRIDHAR GOUD R/o .H.No.3-67, Gouds Colony, Ravutla,Vil Sirikonda, Mdl, Nizamabad Dist., T.S., My Husband Passport No. **M2933302** Have Changed my Surname /name as **CHEPURI CHANDHRAKALA** (New Surname/name) **NTZ-338519**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్ : 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అధికారులు



బాన్సువాడలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ/పెద్ద కొడప్‌గల్/లింగంపేట/నాగిరెడ్డిపేట/మద్నూర్/ఎల్లారెడ్డి రూరల్/రామారెడ్డి, ఫిబ్రవరి 26 : బాన్సువాడ, బీర్కూర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ కిరణ్మయి బుధవారం సందర్శించారు. బాన్సువాడ నియోజకవర్గంలో గురువారం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల సామగ్రి, ఏర్పాట్లను పరిశీలించారు. బాన్సువాడ పోలింగ్ కేంద్రంలో 1,112 మంది పట్టభద్రులు ఉన్నారని, 186 ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రంలో ఎనిమిది మంది సిబ్బంది ఉంటారని చెప్పారు. ఆమె వెంట బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్, గిర్దావర్ అశోక్ తదితరులు ఉన్నారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రూట్ ఆఫీసర్ సల్మాన్, తహసీల్దార్ దశరథ్‌కు సూచించారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ కేంద్రాన్ని ప్రారంభించాలని, పార్టీలకు సంబంధించిన వాల్ పోస్టర్లు ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించాలని ఎస్సై మహేందర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ అంజయ్య, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పోలింగ్ సామగ్రి పరిశీలన..**

మద్నూర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సామగ్రిని సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కేంద్రాలకు చేరుకున్న సామగ్రిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, ఆయా శాఖల సిబ్బంది ఉన్నారు.

**లింగంపేటలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో**

లింగంపేట మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ సందర్శించారు. గురువారం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. మండలంలో 765 మంది పట్టభద్రులు, 34 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో ఎన్నికల నిర్వహణ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్డీవో వెంట స్థానిక తహసీల్దార్ రాజా నరేందర్‌గౌడ్‌తో పాటు పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

**నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో..**

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో ప్రభాకర్ సందర్శించారు. ఎన్నికల సామగ్రి, ఏర్పాట్లపై ఎన్నికల రిట్నరింగ్ అధికారి ప్రిహిత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ఎలాంటి తప్పులు లేకుండా సజావుగా సాగేలా చూడాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, గాంధారి మండలాల్లో మండలానికి రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అందులో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 2,655 ఓటర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 163 ఓట్లు ఉన్నట్లు చెప్పారు. ఇందులో నాగిరెడ్డిపేటలో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 350, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 21 ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

**ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి**

ఎమ్మెల్సీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఆర్డీవో మన్నె ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికల కేంద్రంగా కేటాయించినట్లు ఆయన అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 604 మంది పురుషులు, 223 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 45 మంది పురుష ఓటర్లు, 36 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని ఒకే సెంటర్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన వేర్వేరు బూత్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటును వృథా చేయకుండా సమయానుకూలంగా ఓటు వేయాలన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓట్లు వేయవచ్చన్నారు. ఓటు వేసే సమయంలో ఓటర్లు తమతోపాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా కార్డును తీసుకురావాలన్నారు.

**పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది**

రామారెడ్డిలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ఆరుగురు సిబ్బంది బుధవారం సాయత్రం చేరుకున్నారు అనంతరం పోలింగ్ అదికారులు మాట్లాడుతూ.. ఉదయం 8 నుంచి 4 గంటల వరకు ఓటరు గుర్తింపుకార్డు తమ వెంట తీసుకోని రావాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రం సీసీ టీవీ పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు.



లింగంపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్







రామారెడ్డి, మద్నూర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

# ప్రమాదకరంగా మలుపులు

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

లింగంపేట, ఫిబ్రవరి 26 : తాడ్వాయి మండల పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. తాడ్వాయి మండలం ఎండ్రియాల్ గ్రామం నుంచి కృష్ణాజీవాడి గ్రామం వరకు ఉన్న మూల మలుపుల వద్ద సూచికలు లేని కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇతర ప్రాంతాలకు చెందిన వారు ప్రయాణాలు చేస్తున్న సమయంలో మూల మలుపుల వివరాలు తెలియని కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. శబరిమాత ఆశ్రమం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు సైతం కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ మలుపుల వద్ద ఆర్ అండ్ బీ అధికారులు సూచికలు పెట్టడంలో విఫలమయ్యారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న మూల మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.



తాడ్వాయి గ్రామ శివారులో మలుపుల వద్ద ఏర్పాటు చేయని సూచిక బోర్డులు